క్లుప్తంగా

నేడు అంగన్‌వాడీలకు శిక్షణ

చిట్వేలి : ఉల్లాస్ కార్యక్రమంపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్ సోమవారం తెలిపారు. ఉల్లాస్ ద్వారా వయోజన విద్యను అందించేందుకు మండలంలో 57 అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాల్లోని అంగన్‌వాడీల ద్వారా వృద్ధులకు విద్యను అందించేందుకు కలెక్టర్ ఆదేశించారని ఎంపీడీఓ చెప్పారు. మంగళవారం మండలస్థాయిలో గుర్తించబడిన శిక్షణా కేంద్రాలను సంబంధించి వలంటీర్ టీచర్ (అంగన్‌వాడీ టీచర్)లకు ఒకరోజు శిక్షణ నిర్వహించబడుతుందని, అందుకు హాజరుకావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

నూతన గృహాలకు దరఖాస్తు చేసుకోండి



అద్దెపల్లి ఎస్టీ కాలనీ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్ రెడ్డి

ఓబులవారిపల్లె : నూతన గృహాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని మంజూరు చేస్తామని ఎపీడీఓ మల్‌రెడ్డి అన్నారు. సోమవారం వై.కోట పంచాయతీ అద్దెపల్లి కాలనీ గృహాలను ఆయన పరిశీలించారు. గ్రామంలో భారీ వర్షాలకు ఇంటి స్లాబ్ పైపెచ్చులు ఊడిపడి వర్షపునీరు కారుతుండటంతో దాదాపు 40 కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీఓ గృహాలు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చింతపూడి నాగమ్మ, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉంటాం



గౌతమి, ఏఓ

గాలివీడు : మండల వ్యవసాయ అధికారిగా కె.గౌతమి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ అధికారిగా పనిచేసిన మురళీధర్ తెలంగాణ రాష్ట్రానికి బదిలీపై వెళ్లడంతో గౌతమి ప్రమోషన్‌పై గాలివీడు ఏ.ఓ.గా నియామకమయ్యారు. మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవడం, క్షేత్రస్థాయిలో ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

ఇల్లు కూలిన బాధితుడికి సహాయం



బాధితుడికి ఆర్థిక సహాయం, దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : అయ్యలరాజుపల్లి దళితవాడ గ్రామంలో భారీ వర్షానికి దివ్యాంగుడు దాసరి సుబ్రమణ్యంకు చెందిన ఇల్లు కూలిపోయింది. సోమవారం టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, ఎంపీడీఓ మల్‌రెడ్డిలు పరిశీలించి బాధితుడికి రూ. 15 వేలు ఆర్థిక సహాయం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లడుతూ పక్కా ఇల్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. రెవెన్యూ అధికారులు 20 కేజీలు బియ్యం దాసరి సుబ్రమణ్యంకు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జోన్ చైర్మన్ లయన్ మహమ్మద్ సోమవారం తెలిపారు. గాలివీడు మండలం ప్యారంపల్లె కరణంవారి కొత్తపల్లికి చెందిన కీ.శే పెద్దిరెడ్డి గంగిరెడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంట సభ్యులు నారాయణరెడ్డి, బయ్యారెడ్డిల ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ లయన్ హరీష్ చంద్రస్వామి, భాను, ప్రతాప్‌రెడ్డి, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటిని కలిసిన డీఆర్‌యూసీసీ మెంబర్



ఆకేపాటికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తల్లెం భరత్

రాజంపేట టౌన్ : గుంతకల్లు డివిజన్ డీఆర్‌యూసీసీ సభ్యుడిగా రెండవమారు ఎన్నికైన తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని ఆకేపాటి ఎస్టేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆకేపాటి ఆయన అభినందించి, డివిజన్‌లోని రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోనాసి వెంకటసుబ్బయ్య, గునిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేటలో ప్రభావం చూపని ఫెంగల్

- ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పోలీ చెరువులోకి వరద
- ఓ ప్రాంతంలోని రైతులకు కాసింత ఊరట



పోలీ చెరువులోకి వచ్చిన ఓ మోస్తారు వరద నీరు

రాజంపేట టౌన్ : రాజంపేట డివిజన్‌లోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఫెంగల్ (ఫెయింజల్) తుపాను ప్రభావం బాగా ఉన్నప్పటికీ రాజంపేటపై పెద్దగా కనిపించలేదు. తుపాను కారణంగా గత మూడు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే రాజంపేటలో వర్షం పెద్దగా వర్షం కురవకపోవడం రైతులను నిరాశపరుస్తోంది. అయితే తిరుపతి, రైల్వేకోడూరు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అక్కడి వరద నీరు పుల్లంగేరు మీదుగా ఊటుకూరు వద్ద ఉన్న గరండాల మార్గం నుంచి మండలంలో అతిపెద్ద చెరువు అయిన పోలీ చెరువుకు ఆదివారం రాత్రి నుంచి వరద నీరు వస్తుంది. ఈ కారణంగా సోమవారం పోలీ చెరువు దాదాపు నలభైశాతం మేరకు నిండింది. ఈ చెరువు నిండి అలుగుపార్లితే పోలీ, మందరం, అప్పారాజుపేట, సీతారాంపురం పంచాయతీల్లోని గ్రామాల్లో దాదాపు రెండేళ్లపాటు భూగర్భ జలమట్టం పెరుగుతుంది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. పోలీ చెరువు కింద దాదాపు 2500 ఎకరాల మేరకు పంటలు సాగవుతాయి. ఏది ఏమైనా రాజంపేటపై తుపాను ప్రభావం చెప్పుకోదగ్గ స్థాయిలో లేకపోయినా, ఎగువ ప్రాంతాల్లో సోమవారం కూడా భారీగా వర్షాలు కురవడంతో పోలీ చెరువు నిండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతానికి చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఆరు చెరువుల్లో నీళ్లు నిల్

మండలంలోని మొత్తం ఏడు చెరువులు ఉన్నాయి. వీటిలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా పోలీ చెరువులోకి మాత్రం వరద నీరు చేరుతుంది. అయితే కృష్ణమ్మ, మన్నూరు, ఊటుకూరు, తాళ్లపాక, హస్తవరం, ఆకేపాడు చెరువుల్లోకి ఏమాత్రం నీళ్లు రాకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని రైతుల్లో నిరాశ వ్యక్తం అవుతోంది. 2021వ సంవత్సరంలో వచ్చిన వరదల వల్ల మండలంలో అన్ని చెరువులు నిండి అలుగులు పార్లాయి. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో అనేకమార్లు తుపానులు వచ్చాయి. అయితే ఒకొక్కసారి ఒకొక్క ప్రాంతంలో భారీ వర్షాలు కురిసి ఆయా ప్రాంతాల్లోని చెరువులు నిండాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో సంభవించిన దానా తుపాన్ వల్ల కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో కరువుతీరా వర్షం కురిసి అక్కడి చెరువులు సైతం నిండాయి. అయితే ఒక్క రాజంపేటలో మాత్రం తుపాను ప్రభావాలు లేకపోవడంతో చెరువుల్లో నీళ్లు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి.

ఫెంగల్ నిరాసపరిచింది



ఫెంగల్ తుపాను వల్ల అయినా మండలంలోని చెరువులు నిండుతాయని ఎంతో ఆశపడ్డాం. గత నాలుగు రోజులుగా పెద్దగా వర్షం కురవకపోవడంతో ఆరు చెరువుల్లోకి చుక్క నీరు కూడా రాలేదు. డిసెంబర్ నుంచి తుపాన్ ప్రభావాలు కూడా ఉండవు. అందువల్ల వచ్చే ఏడాది వేసవిలో సాగునీటికే కాకుండా తాగునీటి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– ఆకేపాటి వరప్రసాద్‌రెడ్డి, ఆదర్శరైతు, హస్తవరం, రాజంపేట

రాయచోటి–వేంపల్లి రోడ్డు పనులు పూర్తి చేయాలి

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి – వేంపల్లి రోడ్డు పనులు పూర్తి చేయాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మంత్రి రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 మేలో 204 కోట్లతో ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ రోడ్డు కాంట్రాక్టు తీసుకున్నారని, కొంతమేర పనిచేసి మిగతా రోడ్డు, బ్రిడ్జిల నిర్మాణం పూర్తి కాకుండా అలానే వదిలేశారన్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రోడ్డు మరమ్మతులు పేరుతో గుంతలు తీసి మధ్యలో వదిలివేయడంతో అనేక మంది ప్రమాదానికి గురై మృతి చెందుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా స్పందించి ఎస్ఆర్‌కే కాంట్రాక్టర్‌కు ఇచ్చిన టెండర్‌ను రద్దు చేసి హైవే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు ఓబులేసు, చినబాబు, రాజేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి టౌన్ : విద్యార్థుల భద్రత కోసం ప్రత్యేకమైన అవగాహన కల్పిస్తూ పోస్టర్‌ను తీసుకరావడం అభినందనీయమని రాష్ట్ర రవాణా, క్రీడల, యువజనశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ పేరెంట్స్ అసోసియషన్ వారు ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భద్రత కోసం కడప కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల భద్రత, రోడ్డు భద్రత నియమాలను పాటించే విధంగా పోస్టర్‌ను ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ట్రెజరర్ ఎల్ జితేంద్ర, కన్వీనర్ చంద్రగిరి నారాయణ, కో-కన్వీనర్‌లు వస్త్రాల నరసింహులు, చింతలపల్లె జయ, విశ్వనాథ, సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాహక్కుల సభను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న లిబరేషన్ పార్టీ నేతలు

రాయచోటి అర్బన్ : ఈనెల 4వ తేదీన విజయవాడలో నిర్వహింప తలపెట్టిన ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌పార్టీ జిల్లానేత మావులూరి విశ్వనాథ కోరారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ప్రజాహక్కుల సభ పోస్టర్లను ఆయన పార్టీ నేతలతో కలసి విడుదల చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జరుపుతున్న ప్రజాహక్కుల సభను అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నేతలు రమణ, శ్రీను, రవి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత మంచినీటి పథకం కోసం పరిశీలన



పుల్లగూరు గండివద్ద పరిశీలిస్తున్న అధికారులు

వీరబల్లి : మండల కేంద్రం వాసులకు శాశ్వత మంచినీటి సమస్యను తీర్చేందుకు సోమవారం సంబంధిత అధికారులు పుల్లగూర గండి వద్ద ప్రవహిస్తున్న మాండవ్య నది వద్ద పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, స్థానిక నాయకుడు శ్రీధర్ రెడ్డిలు గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మాండవ్య నది నుంచి మంచినీటి పథకం ఏర్పాటు చేసినట్లయితే వీరబల్లి పంచాయతీలోని గ్రామాలలో ప్రజలకు శాశ్వత మంచినీటి సమస్యను పరిష్కరించవచ్చని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకానికి సహకరించినట్లైతే శాశ్వతంగా మంచినీటి సమస్య లేకుండా చూడవచ్చని చెప్పారు. అందుకు స్థానిక నాయకులైన శ్రీధర్ రెడ్డి తమవంతు మంచినీటి శాశ్వత పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తున్నామన్నారు. అందుకోసం మంచినీటి పథకానికి సంబంధించిన ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులను కోరారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే ‘సైన్స్ ఎక్స్‌పో’



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ, అధికారులు

రాయచోటి టౌన్ : విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి సైన్స్ ఎక్స్‌పోలు (సైన్స్ ఫెయిర్) ఉపయోగపడతాయని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో కలాం విజన్ – 2024 సైంటిఫికల్ ప్రాజెక్టు ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని సందీప్ స్కూల్‌లో ఈ నెల 27,28వ తేదీలలో సైన్స్‌స్పైర్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. ప్రతి విద్యార్థి తమ తమ విజ్ఞానాన్ని ప్రదర్శించి భవిష్యత్తు తరాల శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి, ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి, సందీప్ స్కూల్ హెడ్‌మాస్టర్ వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలి పాడ్యమి వేడుకలు

రామాపురం : మండలంలో పోలి పాడ్యమి వేడుకలు అత్యంత ఘనంగా సోమవారం జరిగాయి. కార్తిక మాసం మొదటి నుంచి ఆఖరి వరకు నిష్టగా ఉండి నెల రోజులపాటు ఉదయం, సాయంత్రం సమయంలో కార్తిక దీపాలు వెలిగించి కార్తిక మాసం పూర్తయిన తరువాత అమావాస్య తరువాత రోజు పోలి పాడ్యమి దీపాలు వెలిగించడం ఆనవాయితీ. నెల రోజుల పాటు దీపాలు వెలిగించి వారు పోలి పాడ్యమి రోజు దీపాలు వెలిగిస్తే కార్తికమాసం అంతా వెలిగించిన పుణ్యం లభిస్తుందనే నానుడి ఉంది. దీంతో మహిళలు సోమవారం తెల్లవారుజామున నుండి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. అంతేకాకుండా మండలంలోని హసనాపురం మూలస్థానేశ్వర ఆలయంలో, స్థానిక హరిహరాలయంలో, గువ్వలచెరువు ఘాటుపై ఉన్న భవానీ శంకర్ ఆలయంలో దీపాలు వెలిగించారు.

జేసీబీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కురబలకోట: మండలంలోని అంగళ్లు కొత్త బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని వాల్మీకిపురం మండలం బూడిదవేడుకు చెందిన జేసీబీ డ్రైవర్ ఎల్లయ్య (39) సోమవారం తీవ్రంగా గాయపడ్డాడు. అంగళ్లు సమీపంలో జేసీబీ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం కోసం అంగళ్లుకు వెళ్లి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొంగి ప్రవహిస్తున్న గుంజన నది



పెనగలూరు: కట్టుకొమ్మ దగ్గర గుంజన నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

పెనగలూరు : మండలంలోని గుంజన నది కట్టుకొమ్మ దగ్గర పొంగి ప్రవహిస్తోంది. గుంజన నది పొంగి ప్రవహించడంతో కొండూరు ప్రాంతంలోని బోరుబావుల్లో నీటిమట్టం పెరిగింది. పెనగలూరు మండలంలో కేవలం నాలుగు మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనా తిరుపతి ప్రాంతంలో వర్షాలు బాగా కురవడంతో చెయ్యేరు, గుంజన నదులు రెండూ సాగడంతో బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతుందని తద్వారా సాగు, తాగునీటి కొరత ఉండదని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూగవారిపల్లి వద్ద గుంజన నదిపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నీరు రావడంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. లోలెవల్ బ్రిడ్జిపై నుంచి దాదాపు 30 గ్రామాలకు వాహనాలు నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. బ్రిడ్జిపై నీరు రావడంతో అవతల గ్రామాలైన కట్టావారిపల్లి, మూగవారిపల్లి పరిసర ప్రాంతాలలో ఉన్న గ్రామాల ప్రజలు చిట్వేలి లేదా సింగనమల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలియజేశారు.

అన్నమయ్య ప్రాజెక్టులో వరదనీటి ప్రవాహం

రాజంపేట టౌన్ : ఫెంగల్ తుపాన్ కారణంగా ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. అందువల్ల అన్నమయ్య ప్రాజెక్టులో వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. ప్రాజెక్టులో సోమవారం 2570 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి సాగింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఫిబ్రవరి వరకు శీతాకాలం కొనసాగుండటం అలాగే ఎండ తక్కువగా ఉండటం వల్ల భూమిలో తేమశాతం ఉంటుంది. ఈ కారణంగా భూగర్భ జలాలు గణనీయంగా అడుగంటిపోయే అవకాశం ఉండదు. అందువల్ల వచ్చే వేసవిలో నీటి ఎద్దడి ఉండక పోవచ్చని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సుండుపల్లె: పింఛా ప్రాజెక్టులోకి చేరిన వరద నీరు

పింఛా ప్రాజెక్టులో పెరిగిన నీటిమట్టం

సుండుపల్లె : ఫెంగల్ తుపాను కారణంగా పింఛా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరదనీరు అధికంగా ప్రాజెక్టులోకి చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం సాయంత్రానికి 1608 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నీరు వస్తుండగా ప్రస్తుతం 996.8 అడుగుల వద్ద 0.26584 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకట్రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటితో ప్రాజెక్టు ఏ సమయంలోనైనా నిండే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు నిండితే ఏ సమయంలోనైనా గేట్లు ఎత్తే అవకాశం ఉందని, కావున ప్రాజెక్టుకు దిగువ ప్రాంతాలలో అనగా ముడుంపాడు, నగిరి, కురవపల్లె, రాగిమానుబిడికి, చిన్నబిడికి, పెద్ద బిడికిలతో పాటు పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో డీఈ చెంగల్ నాయుడు, ఏఈ నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెనగలూరు: మూగవారిపల్లి దగ్గర లోలెవల్ బ్రిడ్జిపై నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



సుండుపల్లె: పింఛా నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు



పెనగలూరు: ఓబిలి - టంగుటూరు మధ్య చెయ్యేరు నదిలో పారుతున్న నీరు

సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తులు

రాజంపేట : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ వై.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ సెంటర్‌లో కోర్సులు జరుగుతాయని, ఈ కోర్సు మూడు నెలలపాటు ఉంటుందన్నారు. విద్యార్హత ఇంటర్మీడియట్‌గా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. వివరాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సంప్రదించాలన్నారు. ఇంటర్ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు.

దిగుబడి ఆశలకు తెగుళ్ల బెడద

- మండలంలో 7500 ఎకరాలలో మామిడి సాగు
- రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- దళారీల దోపిడీని తగ్గించాలంటూ రైతుల విన్నపం



మామిడి పిందెలను తొలుస్తున్న పచ్చ పురుగులు (ఫైల్)

చిట్వేలి : మామిడి సీజన్ ప్రారంభమవుతోంది. పచ్చదనంతో మామిడి తోటలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాదన్నా పెట్టుబడి చేతికి వస్తుందో, రాదో, అప్పులపాలవుతామోనన్న సందిగ్ధంలో మామిడి రైతులు విలవిలలాడుతున్నారు. మండలంలో సుమారు 7500 ఎకరాలలో మామిడి సాగులో ఉంది. గత మూడు సంవత్సరాలుగా తోటలు సక్రమంగా కాయకపోవడం, కాయలు కాసినా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మామిడి రైతులు అప్పులపాలవుతున్నారు. దుక్కులు, అదనపు కొమ్మలు, ఎండు పుల్లలు, బంధనికలు నరకడం, పాదులు తవ్వడం, తెగుళ్ల మందు పిచికారి వంటి పనులకు ఎకరాకు రూ. 30 వేలు నుంచి రూ. 50 వేలు వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంత కష్టపడినా చివరకు రైతుకు పెట్టుబడి కూడా చేతికిరాక అప్పులు మిగులుతున్నాయని వాపోతున్నారు. గతంలో వ్యవసాయం వ్యర్థమని, సారవంతమైన భూముల్లో సైతం మామిడి తోటలు నాటారు. దీనికితోడు డ్రిప్ సౌకర్యం రావడంతో గుట్టలను సైతం చదును చేసుకుని మామిడి చెట్లను విస్తారంగా సాగు చేశారు. ప్రస్తుతం కాపు కాయకపోవడం, కాసినా ధరలు లేకపోవడం, కష్టానికి తగ్గ ఫలితం రాకపోగా అప్పులు మిగులుతుండటంతో మామిడి తోటలు వ్యర్థమని నరికివేస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే మామిడి కాపు కొన్న వ్యాపారులు నష్టాల పేరుతో రైతులకు ఇవ్వాల్సిన మొత్తంలో కొంత కోతపెడుతుంటారు. లాభాలు వస్తే వాళ్లు అనుభవిస్తారని, నష్టాలు వస్తే తామే భరించాల్సి ఉంటుందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా నిస్సహాయ స్థితిలో అన్నీ భరిస్తున్నామని రైతులు వాపోతున్నారు.

తెగుళ్ల భారం..

మామిడి రైతులకు తెగుళ్లు తలకు మించిన భారంగా మారాయి. పూతలు మొదలు కాకముందే డిసెంబర్ నెలలో పురుగుమందు స్ప్రే చేయాల్సి ఉంటుంది. తరువాత దోమ, తేనెమంచు పురుగు నివారణకు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. పిందె పడగానే పచ్చపురుగు (కాయ తొలిచేపురుగు) నివారణకు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. మొత్తం మీద కాయకోసే నాటికి కనీసం 8,9 సార్లు మందులు స్ప్రే చేయాల్సి వస్తుంది. ఇంత చేసినా తేనెమంచు పురుగు ఉధృతి వలన కాయకు మంగు (మరక) వస్తుంది. దీంతో మార్కెట్‌లో కాయకు విలువలేకుండా పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం తేనెమంచు పురుగు మామిడికి శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బధనికల భారం

కేవలం చెట్లు మాత్రమే పెరిగే బధనికలు (చెట్లపై బ్రతికే చెట్లు) వీటిని నరికించడానికి కూలీల ఖర్చు తడిసి మోపెడవుతుంది. కూలీలు దొరకక అవస్థలు పడుతున్నాం. అలానే మామిడి సాగుకు ప్రస్తుతం ఖర్చు రెట్టింపు అయ్యింది. కాయలు చేతికి వచ్చే సమయానికి మార్కెట్లు రేట్లు ఉండటం లేదు.

– షేక్ ఖాసిం, చిట్వేలి, అన్నమయ్య జిల్లా

దళారుల పెత్తనం తగ్గించాలి

మామిడి మార్కెట్ యార్డులో దళారుల పెత్తనం ఎక్కువైంది. దళారులు కోటీశ్వర్లు అవుతుండగా ఆరుగాలం కష్టపడిన రైతులకు నష్టాలు వచ్చి అప్పులపాలవుతున్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేంతవరకు రైతులు నష్టపోతూనే ఉంటారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని దళారీ వ్యవస్థను నిర్మూలించాలి.

– ఆకేపాటి శంకర్ రెడ్డి, నాగవరం, చిట్వేలి మండలం

భక్తిశ్రద్ధలతో వీరభద్రుడికి పల్లకి సేవ



ఉత్సవమూర్తులను పల్లకి సేవకు సిద్ధం చేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేతుడు పల్లకిలో ఊరేగారు. సోమవారం రాత్రి పల్లకి సేవలో భాగంగా మూలవిరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. తరువాత ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు జరిపి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. పూజలలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న బిట్స్ కళాశాల అధినేత భాస్కర్

రామాపురం : మండల పరిధి కుమ్మరపల్లె గ్రామంలోని సూరకవాండ్లపల్లెలో నివసించే పల్లా హరి గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల చదువుల కోసం బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సంస్థల అధినేత మన్నూరు భాస్కర్ మృతుడికి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయనతోపాటు గ్రామ నాయకులు ఉన్నారు.

టోల్ వసూళ్లపై దృష్టి పెట్టండి

కడప కల్చరల్ : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటలో టోల్ పేరిట టిక్కెట్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి జానమద్ది విజయభాస్కర్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

గండికోటలో ఆర్థిక అభివృద్ధి కోసం పర్యాటకుల నంచి డబ్బు వసూలు చేయడం పట్ల పలు ప్రజా, విద్యార్థి సంఘాలు నిరసన తెలుపడాన్ని పరిశీలనలోకి తీసుకోవాలని కోరారు. గండికోట అభివృద్ధి కోసం కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా ఈ ప్రైవేటు వసూళ్ల సంగతి పర్యాటక ప్రేమికుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న ఈ ప్రముఖ పర్యాటక ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.